క్లుప్తంగా

ఏయూ హాకీ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారిణులతో ఆచార్య కృష్ణమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళల జట్టు ఎంపిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ జిమ్మాజియంలో క్రీడాకారిణులను ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎస్.విజయమోహన్, విభాగం హెడ్ ఆచార్య ఎ. పల్లవి అభినందించారు. విజయమోహన్ మాట్లాడుతూ తిరుచునాపల్లి భారతీయ దాసన్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి 30 వరకు హాకీ మహిళల ఇంటర్ యూనివర్సిటీ పోటీలు జరుగుతాయన్నారు. పల్లవి మాట్లాడుతూ హాకీ పోటీల్లో ప్రతిభ చూపి ఏయూకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కోచ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ దుర్గారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏయూలో ఘనంగా ఆదేశ్వరరావు జయంతి



ఆదేశ్వరరావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ ఆచార్యుడు పురుగుళ్ల ఆదేశ్వరరావు 90వ జయంతిని హిందీ విభాగంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. హిందీ భవన్ వద్ద గల ఆయన విగ్రహానికి విశ్వహిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఏయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏయూ అభివృద్ధిలో ఆదేశ్వరరావు పాత్ర ఎంతో ఉందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల ఉత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో నాటి మహనీయులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ప్రవచనాలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న 'మహాభారత కథా యజ్ఞం' కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం అయోధ్య రామతీర్థ ట్రస్ట్ కోశాధికారి, ప్రసిద్ధ గురువు గోవింద్ దేవగిరి మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు ఉపదేశించారు. మహాభారతంలో పాండవులు, కౌరవుల జననం, బాల్యం, వివాదాలు, వివాహం, యుద్ధానికి దారి తీసిన పరిస్థితులు, మహాభారత యుద్ధంలో విభిన్న పరిస్థితులు, కృష్ణభగవాన్ లీలలు, భగవద్గీత విశేషాల గురించి ప్రవచనాల ద్వారా భక్తులకు వివరించారు. ఈ నెల 27 వరకు ప్రవచనాల కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఆదమరిస్తే అంతే..



ఏయూ ఇంజినీరింగ్ కళాశాల రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గొయ్యి

ఏయూక్యాంపస్: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ఏయూ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. వర్షాలకు నీరు చేరి ఇది మరింత ప్రమాదకరంగా నిలుస్తోంది. రాత్రి వేళల్లో గుంత కనిపించక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తాత్కాలికంగా గుంత చుట్టూ చెట్ల కొమ్మలు, రాళ్లు ఉంచారు. ఈ మార్గంలో ట్రాఫిక్‌కు ఇది ఇబ్బందిగా మారింది. సోమవారం పోలీస్ కానిస్టేబుల్ ఇక్కడ ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరిస్తూ.. గుంతను తాత్కాలికంగా పూడ్చే పనిలో పడ్డారు.



ఎస్టీ కాలనీ వద్ద ఫుట్‌పాత్‌పై వ్యాపార సముదాయం



కైలాసగిరి కూడలి వద్ద ఆటో స్టాండ్‌లో టీడీపీ చోటా నాయకుడు ఏర్పాటు చేయించిన టిఫిన్ సెంటర్

కప్పం కట్టుకో.. ఫుట్‌పాత్ వ్యాపారం చేసుకో..



పోలీస్ క్రీడా మైదానం ఎదురుగా బడ్డీలు



ఏఆర్ పోలీస్ మైదానం ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఇటీవల పెట్టిన టీడీపీ కార్యకర్త బడ్డీ



కైలాసగిరి కూడలి షిర్డీసాయి గుడి వెనుక ఫుట్‌పాత్‌పై టిఫిన్, జ్యూస్ షాపులు

- 9వ వార్డులో కాలిబాటల ఆక్రమణ
- గతేడాది రూ.కోట్లతో విశాలాక్షినగర్ రోడ్డు విస్తరణ
- బడ్డీల ఏర్పాటుకు ఫుట్‌పాత్‌లు అద్దెకిచ్చేస్తున్న టీడీపీ నాయకులు
- విచ్చలవిడిగా వెలిసిన దుకాణాలతో ఇబ్బందులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

ఆరిలోవ:

జీవీఎంసీ 9వ వార్డులోని ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. వాటిపై విచ్చిలవిడిగా వ్యాపారాలు వెలుస్తున్నాయి. టీడీపీ స్థానిక నాయకుల బరితెగింపుతో ఇక్కడి కాలిబాటలు వ్యాపార కేంద్రాలుగా మారాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోట్ల జీవీఎంసీ నిధులతో సుందరంగా నిర్మించిన రోడ్లు, ఫుట్‌పాత్‌లు.. కూటమి ప్రభుత్వంలో టీడీపీ చోటా నాయకులకు కాసులు కురిపిస్తున్నాయి. వారి అండతో టిఫిన్ సెంటర్లు, కూరగాయల వ్యాపారం, స్టేషనరీ బడ్డీల నిర్వహణకు అడ్డాగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల వాహనాల పార్కింగ్‌గా వీటిని ఉపయోగించుకుంటున్నారు. దీంతో పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడిచే వీలు లేకుండా పోయింది.

నెలనెలా అక్రమ వసూళ్లు

- కైలాసగిరి కూడలి వద్ద షిర్డీసాయిబాబా మందిరానికి ఎదురుగా కొన్నేళ్లుగా ఆటో కార్మికులు స్టాండ్ నిర్వహిస్తున్నారు. రెవెన్యూ కాలనీ, బీవీకే పాఠశాల వైపు నుంచి వచ్చిపోవడానికి, వాహనాల రాకపోకలకు వీలుగా ఇక్కడ పలకలు వేసి రహదారి నిర్మించారు. దీని వల్ల వాహన చోదకులు కైలాసగిరి కూడలికి వెళ్లి మలుపు తిరగాల్సిన అవసరం ఉండదు. ఈ ఆటో స్టాండ్‌లోని స్థలాన్ని ఇటీవల స్థానిక టీడీపీ నాయకులు ఓ టిఫిన్ సెంటర్ నిర్వహణకు అద్దెకిచ్చేశారు. ఆ వ్యాపారి నుంచి నెలనెలా రూ.7 వేలు అద్దె వసూలు చేస్తున్నారట. దీనివల్ల అక్కడున్న ఓ బ్యాంకు ఏటీఎంకు వెళ్లే దారి కూడా మూతపడుతోంది. ఆటో కార్మికులు వారి ఆటోలను కూడా అక్కడ నిలపలేని పరిస్థితి నెలకొంది.
- ఆర్మ్‌డ్ పోలీస్ గ్రౌండ్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై మరో వ్యాపారిచే బుక్స్, స్టేషనరీ షాపు పెట్టించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీ వద్ద ఫుట్‌పాత్‌పై కూరగాయలు, కిరాణా షాపులు నిర్వహించేస్తున్నారు.
- కైలాసగిరి కూడలి పక్కన షిర్డీసాయిబాబా గుడి వెనుక ఫుట్‌పాత్‌పై టిఫిన్ సెంటర్లు, పాన్ షాప్‌లు నిర్వహిస్తున్న వ్యాపారులు ఇటీవల వాటిని మరింత విస్తరించారు. వీరు కూడా స్థానిక టీడీపీ నాయకులకు కప్పం కడుతున్నట్లు సమాచారం. అందుకే ఫుట్‌పాత్‌పై వారి వ్యాపారమంతా దర్జాగా సాగుతోంది. ఈ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేయించి.. ప్రతి బడ్డీ, టిఫిన్ సెంటర్ వద్ద నుంచి వ్యాపార స్థాయిని బట్టి నెలకు రూ.4,000 నుంచి రూ.7,000 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. వారికి అద్దె చెల్లించని వ్యాపారులను మాత్రం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులపై టీడీపీ నాయకులు ఒత్తిడి చేసి ఖాళీ చేయిస్తున్నారు.



జోడుగుళ్లపాలెంలో ఫుట్‌పాత్‌పై నిలిపిన ద్విచక్రవాహనాలు, వ్యాపార బోర్డులు

గత ప్రభుత్వంలో నిర్మాణం.. నేడు నిర్వీర్యం

ఇక్కడ కొన్ని నెలలుగా వ్యాపారాలు నిర్వహిస్తున్న ఇద్దరిని ఇటీవల టౌన్ ప్లానింగ్ అధికారులచే ఖాళీ చేయించారు. జోడుగుళ్లపాలెం బీచ్ రోడ్డు ఫుట్‌పాత్‌లదీ అదే తీరు. ఇక్కడ వ్యాపారులు ఫుట్‌పాత్‌నే పార్కింగ్‌గా వినియోగించుకొని పాదచారులకు నడవడానికి వీలు లేకుండా చేస్తున్నారు. కైలాసగిరి, తెన్నేటి పార్కులు, జోడుగుళ్లపాలెం బీచ్ తదితర పర్యాటక ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని సందర్శకులు, స్థానికుల సౌకర్యం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రోడ్లు, ఫుట్‌పాత్‌లను కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు వ్యాపారాలకు అద్దెకిచ్చేసి ఇలా కాసులు కురిపించుకొని దుర్వినియోగం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. వార్డ్‌ల టీడీపీ స్థానిక నాయకులు ఇలాంటి దందాలన్నీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అండతోనే చేస్తున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించి పాదచారుల కోసం అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ అధికారులను కోరుతున్నారు.

టీడీపీ చోటా నాయకులకు కాసుల పంట

వార్డులోని హనుమంతవాక జంక్షన్ నుంచి విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి కూడలి వరకు గత ప్రభుత్వంలో జీవీఎంసీ కొన్ని రూ.కోట్లు నిధులు ఖర్చు చేసి 40 అడుగుల రహదారిని 80 అడుగులకు విస్తరించింది. రోడ్డు విస్తరణలో ఇంటి భాగాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించింది. ఈ పనుల్లో భాగంగా రోడ్డుకిరువైపులా పాదచారుల సౌలభ్యం కోసం 4 నుంచి 5 అడుగుల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు నిర్మించింది. అవి ఇప్పుడు కొందరు టీడీపీ స్థానిక నాయకులకు కాసులు కురిపిస్తున్నాయి. ఈ రోడ్డు పక్కన ఎస్సీ, ఎస్టీ కాలనీ నుంచి కైలాసగిరి కూడలి వరకు ఫుట్‌పాత్‌పై పాదచారులు నడవడానికి వీలులేని విధంగా పలుచోట్ల బడ్డీలు, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

టూరిజం డివిజనల్ మేనేజర్‌గా జగదీష్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న జి.వి.వి.జగదీష్

బీచ్‌రోడ్డు: పర్యాటక రంగం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఏపీ టూరిజం ప్రాంతీయ డివిజనల్ మేనేజర్ జి.వి.వి. జగదీష్ అన్నారు. సిరిపురం లోని వీఎంఆర్‌డీఏ భవనం టూరిజం విభాగంలో సోమవారం సాయంత్రం ఆయన డివిజనల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహజమైన విశాఖ అందాలను మరింత ప్రాచుర్యం కల్పించడానికి చర్యలు చేపడతామని తెలిపారు. జగదీష్ ఇప్పటి వరకు విజయనగరం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం సహాయ సంచాలకులుగా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి ఇక్కడికి పదోన్నతిపై వచ్చారు.

ఉత్తరాంధ్ర బీసీని ఏయూ వీసీగా నియమించాలి



గవర్నర్‌కు పంపనున్న లేఖను చూపిస్తున్న లగుడు గోవిందరావు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఉత్తరాంధ్రకు చెందిన బీసీ సామాజిక వర్గ వ్యక్తిని నియమించాలని ఆలిండియా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనాభాకు అనుగుణంగా బీసీలకు తగిన ప్రాతినిధ్యం, పదవులు లభించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో భర్తీ కానున్న ఏయూ వీసీ పదవిని ఉత్తరాంధ్ర బీసీ వ్యక్తికి కేటాయించాలన్నారు. జనగణనతోపాటు కుల గణన జరపాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని సూచించారు. పలు డిమాండ్లతో తయారు చేసిన ప్రత్యేక లేఖను ఈ సందర్భంగా గోవిందరావు విడుదల చేశారు. ఈ లేఖను రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులకు త్వరలో పంపుతామన్నారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

పీవీ ఆర్థిక సంస్కరణలే దేశాభివృద్ధికి మూలాలు

బీచ్‌రోడ్డు: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆనాడు చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేటి భారతదేశ అభివృద్ధికి పునాదులుగా నిలిచాయని రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. పీవీ నరసింహారావు 20 వర్ధంతి సందర్భంగా సోమవారం వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గవర్నర్ బంగ్లా వద్ద ఉన్న ఆయన విగ్రహ ప్రాంగణంలో నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ పీవీ ఎంతో ముందు చూపుతో సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా నేడు ఎవరూ ఊహించని విధంగా దేశం అభివృద్ధి చెందిందన్నారు. దేశ చరిత్రలో పీవీ నరసింహారావు సుస్థిరంగా నిలిచే ఉంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెరువు రామకోటయ్య, వుడా మాజీ చైర్మన్ పి.రవిరాజు, రిటైర్డ్ పోలీస్ అధికారి టి.ఎస్.ఆర్.ప్రసాద్, రాచకొండ చారిటీస్ చైర్మన్ రాచకొండ దశరథ రామయ్య, వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరు చరణ్, న్యాయవాది కేసాప్రగడ నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు నందూరి సుబ్రహ్మణ్యం, కార్మిక నాయకులు కాశీభట్ల నాగభూషణ్, వ్యాస శర్మ, శంకర్ నీలు భాగవతుల తదితరులు పాల్గొన్నారు.



పీవీ నరసింహారావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

పీవీ నరసింహారావుకు ఘన నివాళి

రామ్‌నగర్‌లోని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు తదితరులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న పల్లా దుర్గారావు

కాలుష్య నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని మేయర్ గొలగాని హరివెంకట కుమారి పిలుపునిచ్చారు. ఆరిలోవ పెదగదిలిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం ఉదయం ఆమె ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు. కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక్క రోజు రవాణా వ్యవస్థను, లేదా సైకిళ్లను ఉపయోగించడం వల్ల విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించవచ్చని, అందుకు అందరూ సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాలినడకన కార్యాలయానికి వెళ్తున్న మేయర్ హరివెంకటకుమారి

గాలికొదిలేశారు..

ఏయూక్యాంపస్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జీ-20 సమ్మిట్ సమయంలో విశాఖ నగరాన్ని ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. దీనిలో భాగంగా సాగర తీరంలో జీ-20 సదస్సు ప్రాధాన్యం, ప్రాముఖ్యత, విశాఖ విశిష్టతలను తెలిపే పలు శిల్పాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇవి దయనీయంగా తయారయ్యాయి. దేశానికి, రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపును తీసుకొచ్చి, మధుర జ్ఞాపకాలుగా నిలిచిన వీటిని పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో ఇవి శిథిలమవుతున్నాయి. బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ పక్కనే గతంలో ఏర్పాటు చేసిన జీ-20 లోగోలోని అక్షరాలు విరిగిపోయాయి. లోగో సైతం పక్కకు ఒరిగిపోయింది. అక్కడ ఏర్పాటు చేసిన దుప్పి బొమ్మల కొమ్ములు దెబ్బతిన్నాయి. డెస్టినేషన్ ఆంధ్ర, విశాఖపట్నం సిటీ అనే అక్షరాలు మాత్రమే ఇక్కడ ప్రస్తుతం కనిపిస్తున్నాయి. సదస్సు సమయంలో ఏర్పాటు చేసిన పచ్చదనం కనుమరుగైనా, కనీసం నాటి జ్ఞాపకాలుగా నిలిచే ఇటువంటి కళాఖండాలను పరిరక్షించాల్సిన అవసరం ఉంది. పర్యాటకులు నిత్యం ఈ ప్రాంతంలో ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు. అధికారులు వీటికి మరమ్మతులు చేయించి, పూర్వ వైభవం తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



బీచ్ రోడ్డులో శిథిలమైన జీ-20 లోగో శిల్పాలు,అక్షరాలు

ఏయూ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కల్పిస్తాం

విశాఖ విద్య: ఆంధ్రా విశ్వవిద్యాలయ విద్యార్థులకు అదానీ విల్మార్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సంస్థ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ సిద్ధార్థ ఘోష్ తెలిపారు. క్యాంపస్‌లో జరిగే సంస్థ నియామక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏయూను ఆయనతోపాటు డీజీఎం-హెచ్ఆర్ ప్రభాకర్, ప్లాంట్ హెచ్ఆర్ హెడ్ యుగంధర్ తదితరులు సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులను కార్యాలయంలో సిద్ధార్థ ఘోష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదానీ విల్మార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం మధ్య శాస్త్రీయ, పారిశ్రామిక బంధం బలోపేతం చేసుకుంటూ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అదానీ విల్మార్ సంస్థ ఏయూ ఎంహెచ్ఆర్ఎం, ఎంబీఏ-హెచ్ఆర్ విద్యార్థులకు రూ.8.5 లక్షల వార్షిక వేతన ప్యాకేజీని ప్రకటించింది. విద్యాలయ అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను సన్మానించారు. సైన్స్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు.



సంస్థ ప్రతినిధులను సన్మానిస్తున్న ఏయూ వీసీ, రిజిస్ట్రార్

ఇంటర్ పరీక్ష ఫీజుకు తత్కాల్ అవకాశం

విశాఖ విద్య: ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లించేందుకు తత్కాల్ అవకాశం కల్పించినట్లు ఆర్ఐవో మురళీధర్ తెలిపారు. ఈ నెల 31లోపు రూ.3 వేలు ఫీజు చెల్లించి పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి

సీతమ్మధార: ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలని సిబ్బందిని జీవీఎంసీ జోన్-3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ ఆదేశించారు. ఆశీలమెట్టలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి ఇద్దరు ఫిర్యాదు చేశారన్నారు.

చల్ చల్ గుర్రం

ఏయూక్యాంపస్: పట్టుమని పదేళ్ల వయసు కూడా లేని బాలుడు. ధైర్యంగా గుర్రంపై సవారీ చేస్తున్నాడు. సోమవారం ఉదయం బీచ్ రోడ్డులో ఈ దృశ్యం కనిపించింది. ఇద్దరు అన్నదమ్ములు రెండు గుర్రాలపై వీఎంఆర్‌డీఏ పార్క్ నుంచి ఆర్.కె.బీచ్ వైపునకు వెళ్తూ కనిపించారు. ఎటువంటి భయం లేకుండా వీరు ధైర్యంగా గుర్రాలపై సవారీ చేయడం అందరినీ ఆకట్టుకుంది. వీరిలో ఒక బాలుడి వయసు పదేళ్ల లోపే. పక్క నుంచి కార్లు, బైక్‌లు దూసుకుపోతున్నా బెదరకుండా.. అదరకుండా కళ్లెం పట్టుకుని గుర్రాన్ని నడిపిస్తూ వీరిద్దరూ వెళ్లిన విధానం, వీరి ధైర్యం చూసిన పర్యాటకులు, నగరవాసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



బీచ్ రోడ్డులో గుర్రంపై సవారీ చేస్తున్న అన్నదమ్ములు

ముడసర్లోవ పార్కు గట్టు అస్తవ్యస్తం

ఆరిలోవ: నగరంలోని పర్యాటకులకు అందుబాటులో ఉండే ముడసర్లోవ పార్కు గట్టు అస్తవ్యస్తంగా మారింది. ఈ పార్కుకు, ముడసర్లోవ రిజర్వాయర్‌కు మధ్యలో ఎత్తయిన గట్టు ఉంది. అది కూడా ఇక్కడ పర్యాటకంలో భాగమైంది. ఈ గట్టు పైనుంచి చూసే వారికి ఓ పక్క రిజర్వాయర్.. మరోపక్క చుట్టూ పచ్చని కొండలు కనువిందు చేస్తాయి. ఎత్తయిన ఈ గట్టు మీదకు చేరడానికి పార్కు లోపల నుంచి అధికారులు మెట్ల మార్గం ఏర్పాటు చేశారు. గట్టుపై భారతదేశం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మ్యాపులను పచ్చని మొక్కలతో ఏర్పాటు చేసి సందర్శకులను ఆకర్షించేలా తీర్చిదిద్దారు. ఇప్పుడా మ్యాపులు కనిపించడం లేదు. గట్టంతటా పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి. దీని మీదకు చేరడానికి నిర్మించిన మెట్లు విరిగిపోయాయి. దీంతో పైకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గట్టుపై సందర్శకుల సౌకర్యం కోసం నిర్మించిన సీసీ రోడ్డు శిథిలమైంది. పలు చోట్ల బీటలు వారి పెచ్చులూడిపోవంతో గట్టుపై సందర్శకులు నడవలేని పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ అధికారులు స్పందించి పార్కులోని గట్టును ఆధునికీకరించాలని సందర్శకులు కోరుతున్నారు.



పార్కులో శిథిలమైన గట్టు దారి